# కథాసుధ



## క్షతగాత్రుడు.

-నిమిత.

స్టేషన్ దగ్గరౌతుంది కాబోలు, ట్రైన్ వేగం మెల్లగా తగ్గసాగింది. అంతవరకూ పచ్చని పొలాల మధ్య వంకలు తిరుగుతూ పరిగెడుతున్న పిల్లకాలువ వెంబడి పరిగెత్తిన అతని చూపులు ఇప్పుడు అంతరంగపు పుటలను శ్రద్ధగా తిరగేస్తున్నాయి. మూడేళ్ళక్రితం, అతనిదే స్టేషన్ నుండి బయలుదేరినప్పుడు, అతని తల్లిదండ్రులు, ఐదునెలల గర్భంతో ఉన్న భార్య, కన్నీటితో మెరిసే కళ్ళతో అతని చెల్లెలు,చేతులూపుతూ వీడ్కోలు చెపుతున్న దృశ్యం అతని కళ్ళ ముందు మెదులుతోంది. ఈ మూడేళ్ళలో, తను లేకుండా పుట్టి, ఎదిగిన కొడుకూ, పెళ్ళైయిపోయి మరో ఇంటికి వెళ్ళిన చెల్లెలు. మనిషి జీవితంలో మార్పులు ఎంత వేగంగా సంభవిస్తాయి? రెండు నెలలు ఆలస్యంగా చేరిన ఫొటోలో కొడుకుని చూసుకుని సంతృప్తి పడవలసి వచ్చింది. ఇలా ఆలోచనలు గజిబిజిగా ఉండగానే స్టేషన్ వచ్చేసింది. లేచి, తన సామాను సర్ధుకుని సీటు కింద వదిలిన మేజోళ్ళు, బూట్లు తగిలించుకుని, మరోసారి టోపీ సర్దుకుని లేచి నిలబడ్డాడు. ఇంతలో "అన్నయ్యా!" అంటూ పిలుపు వినబడింది. కిటికీ చువ్వలకి రెండు చేతులు ఆనించి, మొహమంతా వెలిగిపోతున్న నవ్వుతో నిలబడి ఉంది అతని చెల్లెలు. మెడలో నల్లపూసలు, బంగారపు తాడూ, నొసటన కుంకుమ... తనకు పరిచయం లేని వ్యక్తిలా, తను లేకుండా చూసి అమాంతంగా ఓ పదేళ్ళు పెద్దదైన దానిలా ఉంది. పెదాల మీద కల్మషంలేని అమాయకతని ఒలికించే చిరునవ్వు ఒక్కటే, ఆ పాత చెల్లెలు చిరునామాలా, చెక్కుచెదరలేదు. రెండు సూట్ కేసులు చెరొక చేతిలో పట్టుకుని దిగబోతుంటే "ఒకటిలా ఇవ్వండి బావగారూ!" అంటూ ఒక యువకుడు అందుకున్నాడు. "మావారు" అంటూ చిరుసిగ్గుతో పరిచయం చేసింది చెల్లెలు. ‘నమస్తే‘ అని పలకరింపుగా నవ్వాడు. ట్రైన్ దిగి, దృష్టి సారించి చూసాడు. ఎదురుగా తల్లిదండ్రులు నుంచొని ఉన్నారు. దగ్గరకు వచ్చిన అతని చెంపలు నిమిరింది చెమర్చిన కళ్ళతో అతని తల్లి. అంతకన్నా ఆప్యాయమైన పలకరింపు మరేముంటుంది? మరేం అడగాలో తెలీక "ఏరా. ప్రయాణం బాగా జరిగిందా?" గాద్గథికమైన కంఠంతో అతడి తండ్రి పలకరింపు. అవునన్నట్లుగా తలాడించాడు. తర్వాత నెమ్మదిగా కళ్ళెత్తి, భార్య కళ్ళల్లోకి చూసాడు. ప్రాణమంతా కళ్ళల్లో పెట్టుకుని, ఎగిసిపడుతున్న ప్రేమని ఆపలేక కళ్ళార్పుతూ, మళ్ళీ ఆక్షణంలో ఈ దృశ్యమెక్కడ మాయమౌతుందో నన్న భయంతో అతనికేసి అలాగే చూస్తూ నిలబడింది. అంతులేని వీళ్ళందరి ప్రేమ చూస్తుంటే, ఏదో అసంతృప్తి అతని గుండెని పిండేస్తోంది. ఎందుకో తెలీని అసహనం, ఈ ఆప్యాయత నుండి దూరంగా పారిపోవాలన్న వెర్రి ఆవేశం పీడిస్తోంది.

ఇంతలో తన వెనక కొంగు కళ్ళకడ్డం పెట్టుకుని, బిడియంగా నిలబడ్డ ఓ చిన్న బాబుని ముందుకి తీసుకువచ్చి, 'నాన్నగారురా' అంటూ ముందుకి తోసింది అతని భార్య. మెల్లగా మోకాళ్ళ మీద వంగి, చేతులు చాచి ఆ బాబుని దగ్గరకు తీసుకున్నాడు. తన ఊపిరి తనే నిర్భంధించుకొన్నట్లు, తన ఉనికిని తనే నియంత్రించుకున్నట్లు ఆ నిముషం అలా కాలంలో స్థిర ఛాయా చిత్రంలా నిలిచిపోయింది. ఒకప్పుడు ఆ చిన్ని ప్రాణం ఎక్కడుంది? దీనికంతటికీ ప్రారంభం అర్ధం, పర్ధం లేని దారిలో ప్రయాణిస్తున్న అణువుకాదూ? తనలోని అంతర్భాగం కాదూ? అప్రయత్నంగా అతని శరీరమంతా కంపించింది. ఆ క్షణం మళ్ళీ రాదు కదూ? మొదటిసారి తన సంతానాన్ని కౌగలించుకున్న అనుభూతి. ఉన్నట్లుండి అతని మస్తిష్కంలో గొప్ప విస్ఫోటనం జరిగింది. లిప్తపాటులో అతనిలోని సంఘర్షణకి క్రమంగా ఓ ఆకారం ఏర్పడసాగింది. చెట్లతో కలిసిపోయే యూనిఫాంలో, మొహమ్మీద మసితో ఉన్న ఓ సైనికుడి అచలన శరీరం. వివరాలేమీ గుర్తులేవు కానీ, శిక్షణననుసరించి, అతని ఆలోచనలతో ప్రమేయం లేకుండా తుపాకీనెత్తి కాల్చడం మాత్రం మదిలో ముద్రించుకొంది. ఇదే విధంగా అతని కుటుంబ సభ్యులంతా స్టేషన్ లో ఎదురు చూస్తుంటే, ఆ సైనికుడి శరీరం శవపేటికలో రైలులోంచి దిగుతున్న దృశ్యం పదే పదే అతని ముందు మెదులుతోంది.

"అబ్బాయి కళ్ళూ. ముక్కూ అచ్చు నీలానే ఉన్నాయిరా"

"నాన్నగారి పేరు కలిసి వచ్చేలా పెట్టాం పేరు"

ఇలాంటి మాటలు విన్నప్పుడల్లా అతని మనసుకి శూలాలు గుచ్చుతున్నట్లుగా ఉంది. తన చేతిలో అంతమైన అతనికి పిల్లలున్నారా? ఉంటే "మీ నాన్నగారురా" అంటూ అతని భార్య తన వెనుక దాగున్న పిల్లవాడికి శవపేటికను చూపించిందా? పిల్లలే లేకపోతే, అతన్ని తలపించేట్లు రూపం పోసుకుని, అతని నాన్నగారి పేరును పెట్టుకోవడానికి వారసులు లేనట్లేగా. ఆ కుటుంబ సభ్యుల కళ్ళల్లోంచి జారే మౌనపు చుక్కలకి అర్ధాన్నెవరు వెతక గలరు? ప్రతి మనిషి దు:ఖం వెనుకా, మరెవరికీ తెలియని కారణాలెన్నుండవచ్చు? ఇసుకలో తను కనుక్కున్న నత్తగుల్లలూ, అగ్గిపెట్టెలో దాచిన మిణుగురు పురుగులూ, మెరిసే కళ్ళతో పరిగెత్తుకొచ్చి గర్వంగా చూపిస్తున్న కొడుకుని చూసినప్పుడల్లా అతనికి అర్ధంకాని ఆవేశం ముంచెత్తుతోంది. తండ్రికి సహజమైన వాత్సల్యం, అది చూపించబోతే భయంకరమైన తప్పుచేస్తున్న భావన. అతనికి అర్ధంకాని సంక్లిష్టమైన ఘర్షణ. తన కిష్టమైన వంటలు చేసి శ్రద్ధగా తల్లి వడ్డించినప్పుడూ, వెనుకనుండి భార్య మెల్లగా హత్తుకున్నప్పుడు తన మీద తనకే అసహ్యం కలుగుతోంది.

రెండు వీధులవతల, ఓ యువకుడికి యుద్ధంలో కాలు పోయిందని ఇంట్లో అందరూ విచారంగా చెప్పుకుంటూనే లోలోపల తనకేం కాలేదని సంతోష పడుతుంటే అతనికి పట్టరాని అసూయ వేసింది. కాలు పోయిన అతని జీవితం ఎంత సులభం ! అతని దు:ఖానికి బాహ్యంగా ఒక కారణం కనపడుతోంది, తన దు:ఖం ఎవరితో చెప్పుకోగలడు? యుద్ధంలో చంపడం ఒక భాగమనీ, ఆత్మ రక్షణే ప్రథమ కర్తవ్యమనీ, సృష్టిలో అన్ని ప్రాణులూ ఇలా మెలుగుతాయనీ.. శిక్షణలో ఎంత బోధించినా, తాత్కాలికంగా ఆలోచించగలిగే మనిషికి మరణాన్ని ఆమోదించకలగడం చాలా కష్టం. మరణించడమంటే ఒక మనిషి అస్థిత్వం భౌతికంగా నశించడమే కాదు, దానితో పాటు అతని కలలు, జ్ఞాపకాలు, భావిష్యత్తు ప్రణాళికలు, ప్రేమలు, దు:ఖాలు,

బలహీనతలు అన్నీ నశించడ, మరణం తర్వాత కావలసిన వాళ్ళ జ్ఞాపకాల్లో మరో రెండు సంవత్సరాలు బ్రతుకుతాడేమో. కానీ, ఆ  తర్వాత కాల గమనంలో వాళ్ళ జ్ఞాపకాల్లో ఏ మూలో కప్పడిపోయి శాశ్వతంగా నశిస్తాడు.

ఇలాంటి ఆలోచనలతో అతనికి నిత్యం బ్రతుకు భరించలేని పరిస్థితయింది. దాని ఫలితంగా అతను మరింత అంతర్ముఖుడై పోయాడు. ఓ అర్ధరాత్రి కలలమధ్య నిర్ణయించుకుని దేశాల మధ్య యుద్ధం ప్రకటించే నాయకులకి ఈ అంతర్ సంఘర్షణలకు అర్ధమేం తెలుస్తుంది? అతను ఇంట్లో వాళ్ళతో మాట్లాడ్డం పూర్తిగా మానేశాడు. కొడుకు దగ్గరికి వచ్చినప్పుడు గట్టిగా అరవడమో, కొట్టడమో జరుగుతుంది. అతని ప్రవర్తన అందరికీ కష్టంగా ఉంది. అతనితో మాట్లాడటానికే భయపడి దూరంగా ఉండసాగారు ఇంట్లో అతనితో మాట్లాడగలుగుతుంది అతని కొడుకొక్కడే. మనమెంత క్రూరంగా ప్రవర్తించినా, మనల్ని క్షమించి అంగీకరించగలిగేది స్వచ్ఛమైన పసిమనసులు మాత్రమే. ఇలాంటి పరిస్థితుల మధ్య జరిగిందా సంఘటన.!!

మధ్యాహ్నం పూట ఏదో పుస్తకం అన్యమనస్కంగా తిరగేస్తూ, గ్లాసులో విస్కీ ఖాళీ చేస్తున్న అతని గదిలోకి " నాన్నా చూడు నేనేం తెచ్చానో" అంటూ అరుస్తూ వచ్చిన కొడుకు వేపైనా చూడకుండ, సగ స్పృహలో చెయ్యి గట్టిగా విసిరాడు. చేతికి ఉన్న ఉంగరం పిల్లవాడి తలకి తగలడం, వాడు కుప్ప కూలిపోవడం ఒకేక్షణంలో జరిగాయి. వాడి చేతిలో ఉన్న వింత రంగుల సీతాకోక చిలుక సంకేతాన్నందిస్తున్నట్లుగా పైకెగిరిపోయింది...!!!

మనం మరొకరికి కలిగించిన దు:ఖానికి మూల్యం, మనదు:ఖమే కదూ!

(భౌతిక, మానసిక హత్యలు లేని, సరిహద్దులు లేని ప్రపంచం పగటికలని తెలిసినా, అలాంటి భవిష్యత్‌ని ఆకాంక్షిద్దాం.)







